క్లుప్తంగా

పోషకాహారంతో వ్యాధి నిరోధక శక్తి



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి

సత్యవేడు: పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి తెలిపారు. మదనంబేడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, ఆకుకూరలు, పండ్లు సమృద్ధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, మహిళా పోలీస్ భవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ఉష, ఆశావర్కర్లు తేన్మయి, యశోద పాల్గొన్నారు.

పోషకాహారం ఆరోగ్యదాయకం

రేణిగుంట: సమతుల పౌష్టికాహారం ఆరోగ్యదాయకమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమావతి అన్నారు. మండలంలోని గుత్తివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాలక మండలిలో అవకాశం కల్పించండి



ఎమ్మెల్యేతో నాయీబ్రాహ్మణులు

శ్రీకాళహస్తి: నాయీబ్రాహ్మణులకు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలిలో అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని కోరారు. ఈమేరకు వారు ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో కలసి ఆయన్ను సన్మానించారు. వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలిలో నాయీబ్రాహ్మణుల తరపున కొత్తపట్నం మహేంద్రకు అవకాశం కల్పించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ఏర్పేడు: ప్రజలందరూ కలసికట్టుగా బాల్యవివాహాలను నిర్మూలిద్దామని ప్రగతి సంస్థ మండల కో–ఆర్డినేటర్ శిరీష అన్నారు. బుధవారం మండలంలోని పంగూరు, చింతలపాలెం, కుమ్మరిమిట్ట ఎస్టీ కాలనీల్లో జీవన నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో బాల్యవివాహాలు జరిగే అవకాశాలు ఉంటాయని అన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. సంస్థ ప్రతినిధులు మురగయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీల ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: విజయవాడ వరద బాధితులకు ఆర్ఎంపీలు రూ.51,116 ఆర్థికసాయం చేశారు. ఈ నగదును బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి అందజేశారు. వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంపీల జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడు మోహన్, కార్యవర్గ సభ్యులు వీరయ్య, శివశంకర్, రామమూర్తి, రాంబాబు, బాషా, సురేష్‌రెడ్డి, రాజేంద్ర, మనోజ్, వెంకటేశులు, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.10కోట్లతో అభివృద్ధి పనులు

శ్రీకాళహస్తి రూరల్: నియోజకవర్గంలో 100రోజుల పాలనలో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అన్ని వివిధ దశలలో ఉన్నట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊరందూరులోని ఆయన నివాసంలో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు

దళితుల భూములపై టీడీపీ నేతల కన్ను

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొంతమంది టీడీపీ మండల నాయకుల కన్ను దళితుల భూములపై పడిందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 1991లో శ్రీకాళహస్తి రూరల్ మండలంలో రామాపురంలో దళితులకు సాగు భూమి కోసం ఒకో కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున అప్పటి కలెక్టర్ నాగార్జున, జేసీ వెంకటరమేష్, తహసీల్దార్ గురుమూర్తి ఆధ్వర్యంలో 4 గ్రామాల దళితులకు భూములు ఇచ్చారన్నారు. అయితే ఈభూములపై టీడీపీ నేతల కన్నుపడడంతో మధ్యవర్తులుగా కొంతమంది దళితులను పిలిపించి ఎకరాకు రూ.8లక్షలు ఇస్తామని దళితులకు ఆశ చూపి కొనుక్కోవడం జరిగిందని తెలిపారు. కొంతమంది దళితులు వ్యతిరేకిస్తున్నా వారి మధ్య గొడవలు పెట్టి భూములను తక్కువ ధరతో కొట్టేయాలని చూస్తున్న నాయకులపై ఎమ్మెల్యే బొజ్జల స్పందించి భూములు దళితులకే ఉండేలా చేయాలని కోరారు.

అతిగా రసాయనాల సాగులో అనర్థాలు

ఏర్పేడు: సాగు భూములకు ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకంతో రైతులకు మేలుకంటే కీడు ఎక్కువగా జరుగుతుందని వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ఏడీఏ భాస్కరయ్య అన్నారు. బుధవారం బండారుపల్లిలో పొలంబడి, రైతు శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త నాగమణి, ఉద్యాన శాఖ అధికారిణి పుష్పలత, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, ఏఓ షణ్ముగం, రైతులు పాల్గొన్నారు.

మేము ఎంబీబీఎస్ చదవొద్దా?



మా తల్లిదండ్రులు వ్యవసాయదారులు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటవుతున్న వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం వల్ల ఎందరికో నష్టం జరుగుతుంది. ప్రభుత్వ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. మాలాంటి పేద విద్యార్థులు వైద్యవిద్యను చదివే అవకాశం ఉంటుంది. వాటిని ప్రైవేట్‌పరం చేస్తే వైద్యవిద్యకు దూరం కావాల్సిందే. ఇకపై ధనికులే వైద్యవిద్యను చదివే వీలుంటుంది. గత ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన వైద్యకళాశాలలన్నీ త్వరితగతిన పూర్తిచేసి అదనంగా ఎంబీబీఎస్ సీట్లు తీసుకొచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. -శిరీష, బైపీసీ విద్యార్థిని, ఏర్పేడు మండలం



ప్రభుత్వమే నిర్వహించాలి




గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రైవేట్‌పరం చేస్తే మాలాంటి పేద విద్యార్థుల మెడిసిన్ చేయాలనే కల సాకారం కాదు. పేద విద్యార్థులకు మేలు చేయాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేయడానికి ప్రయత్నిస్తోంది. నీట్‌లో మంచి ర్యాంకు సాధించడానికి కృషిచేస్తున్నా. ప్రైవేట్ పరం చేస్తే ఫీజులు చెల్లించలేక వైద్యవిద్యకు దూరం కావాల్సి ఉంటుంది.

-సుస్మిత, బైపీసీ విద్యార్థిని, ఏర్పేడు మండలం

ఆరు నూరైనా నయా వంచన ఫిక్స్

అన్నదాత ఆర్థిక సాయం



నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి రూ.కోట్లలో
శ్రీకాళహస్తి	26,974	53.94
సత్యవేడు	33,944	67.88

నిరుద్యోగ భృతి




నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి రూ.కోట్లలో
శ్రీకాళహస్తి	32,392	116.61
సత్యవేడు	80,000	288.00

ఆడబిడ్డ నిధి



నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి రూ.కోట్లలో
శ్రీకాళహస్తి	96,853	14.62
సత్యవేడు	1,09,968	197.94





ఇంతన్నాడంతన్నాడే చంద్రబాబు.. మీకంతా ముంతమామిడి పండన్నాడే బాబు.. హస్కన్నడు బుస్కన్నాడే చంద్రబాబు.. జనాన్ని నట్టేట ముంచేశాడే చంద్రబాబు.. ఓలమ్మో అని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రం తలరాతే మార్చేస్తానని నాడు ధాంబికాలు పలికాడు. సూపర్ సిక్స్.. ఇది ఫిక్స్ అన్నాడు. అయితే సెప్టెంబర్ 20 నాటికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతుంది. అయినా ఇప్పటికి ఒక్క పథకం తెచ్చుంటే ఒట్టు. పథకాల అమలుపై స్పష్టత లేదు. సీఎం చంద్రబాబు ఏమో ఏడాది పాటు లేదంటూ చేతులెత్తేస్తున్నాడు.. ఇదేనా బాబూ.. నీ నైజం.. తెలిసీ ఓట్లేసి మోసపోయామని జనం వాపోతున్నారు. -వరదయ్యపాళెం/రేణిగుంట

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

వైఎస్సార్ సీపీ పాలనలో కలిగిన లబ్ధి

శ్రీకాళహస్తి నియోజకవర్గం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	శ్రీకాళహస్తి	24,612	రూ.33.22
అమ్మఒడి	శ్రీకాళహస్తి	27,419	రూ.41.12

సత్యవేడు నియోజకవర్గం

పథకం	నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	సత్యవేడు	33944	25.77
అమ్మఒడి	సత్యవేడు	28529	42.79

తల్లికి వందనం



నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి రూ.కోట్లలో
శ్రీకాళహస్తి	27,419	41.12
సత్యవేడు	31,341	47.01

ముగ్గురు పిల్లలకూ వచ్చేనా?



మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వరదయ్యపాళెంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో మా ముగ్గురు పిల్లలు చదువుతున్నారు. ఎన్నికల సమయంలో నేతల వాగ్దానాలు విన్నాం. మాకు ఒక్కొక్కరికీ రూ. 15వేల చొప్పున ఏడాదికి రూ. 45 వేలు వస్తుందని ఎంతగానో ఆశపడ్డాం. అయితే ఇప్పటివరకు తల్లికి వందనం అందలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నా ఖాతాలో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి.

-పద్మ, వరదయ్యపాళెం మండలం

భృతి కోసం వేచి చూస్తున్నా



నేను బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ప్రస్తుతం ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ద్వారా నెలకు ఇస్తామన్న రూ.3వేలు తక్షణమే పంపిణీ చేయాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులవుతోంది. రానున్న నెల నుంచైనా రూ.3 వేలు అందజేస్తే నాలాంటి నిరుద్యోగుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది.

-లోకేష్, నిరుద్యోగి, పాండూరు, వరదయ్యపాళెం మండలం

పెట్టుబడి సాయం అందించాలి



కూటమి నేతలు రైతులకు పెట్టుబడి సాయం ద్వారా రూ. 20 వేలు ఇస్తామని చెప్పారు. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటి వరకు రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. గత ప్రభుత్వం రైతు భరోసా కింద ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే సమయానికి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశారు. ప్రస్తుతం పెట్టుబడి సాయం అందని కారణంగా అప్పులు చేసి వ్యవసాయ పనులు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే ప్రభుత్వం చొరవ చూపి పెట్టుబడి సాయం అందించాలి.

-గంగయ్య, రైతు, వరదయ్యపాళెం మండలం

ఏదీ మహిళలకు రూ. 1,500



పద్దెనిమిదేళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఊకదంపుడు మాటలతో ప్రజలను నమ్మించారు. ప్రభుత్వం ఏర్పడి సెప్టెంబర్ 20 నాటికి వంద రోజులు కావస్తున్నా ఇప్పటి దాకా మహిళలకు రూ.1,500 ఇస్తామన్న హామీ గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. నాతో పాటు మహిళలందరూ ఈ పథకం ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నారు. హామీ అమలు చేయకపోతే మహిళల నుంచి పెద్దఎత్తున ఉద్యమం తప్పదు.

-మోహన, వరదయ్యపాళెం

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని దీక్ష



దీక్ష చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగలో స్వచ్ఛభారత్ కార్మికులు శ్రీనివాసులు, జ్యోతిని విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. వారు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు అన్నాదొరై, సుభాష్ మాట్లాడుతూ మండలంలో స్వచ్ఛభారత్ కింద కార్మికులు వందమందికి పైగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి 30 నెలలుగా జీతాలు ఇవ్వలేదని తెలిపారు. పంచాయతీలకు 15 ఆర్థిక సంఘం నిధులు విడుదలైనా జీతాలు ఇవ్వలేదని, అడిగితే పని నుంచి ఆపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. కరోనా కష్టకాలంలో కూడా స్వచ్ఛభారత్ కార్మికులు, పంచాయతీ కార్మికులు ప్రాణాలను ఫణంగా పెట్టి గ్రామాలను శుభ్రం చేశారని గుర్తు చేశారు. అప్పల్‌రాజు కండ్రిగలో విధుల్లో తొలగించిన ఇద్దరు కార్మికులను వెంటనే పనుల్లో తీసుకోవాలని, పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరారు. లేని పక్షంలో ఈ ఉద్యమం జిల్లా వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మునిచంద్ర, ఆనంద్, జ్యోతి, శ్రీనివాసులు, రాజా, సరళ, అంకమ్మ, పెద్ద గోవిందయ్య, కార్మికులు పాల్గొన్నారు.

వికృతమాలలో కట్టడాల కూల్చివేత



పక్కాగృహాన్ని కూల్చివేస్తున్న హిటాచీ

ఏర్పేడు: ప్రభుత్వ కాల్వ పోరంబోకు భూముల్లో నిర్మాణాలు చేపట్టారని రెవెన్యూ అధికారులు వాటిని కూల్చివేసిన ఘటన మండలంలోని వికృతమాల ఎస్సీ కాలనీ సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన బుధవారం చోటుచేసుకుంది. ఆర్ఐ నల్లయ్య అందించిన వివరాలు. వికృతమాల రెవెన్యూలో సర్వే నంబర్ 51లో 18.80 ఎకరాల కాల్వ పోరంబోకు భూములు ఉన్నాయి. రేణిగుంట మండలంలోని యోగానంద కళాశాల సమీపం నుంచి టీసీఎల్ కంపెనీ, వికృతమాల ఎస్సీ కాలనీ మీదుగా స్వర్ణముఖి నదివరకు వానకాల్వ ఉంది. గత ఏడాది వికృతమాల ఎస్సీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి వానకాల్వను పూడ్చివేసి పక్కా గృహాన్ని నిర్మించాడు. అలాగే స్థానిక కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు టీసీఎల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కాల్వ పోరంబోకులో మట్టిని తోలి చిల్లర అంగడి గుడిసె, హెయిర్ కటింగ్ సెలూన్ బంకును ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు గత నెల 9న నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రెవెన్యూ అధికారులు పక్కాభవనం, చిల్లర దుకాణం గుడిసె, హెయిర్ కటింగ్ సెలూన్ బంకును హిటాచీతో కూల్చివేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతుపరులమని టీడీపీ నేతలు కక్ష్యపూరితంగా తమ దుకాణాలను కూల్చివేయడం దారుణమని వాపోతున్నారు.

ఘనంగా ఉమామహేశ్వర వ్రతం

వరదయ్యపాళెం: స్థానిక గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ఉమామహేశ్వర వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. భాద్రపద మాసం పౌర్ణమి, ఉమామహేశ్వర వ్రతం పుణ్యదినమును పురస్కరించుకుని బుధవారం మృత్యుంజయ సహస్రనామ అష్టోత్తర పూజ చేశారు. లోకా ఫౌండేషన్ ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ బొప్పన రమేష్ మాట్లాడుతూ మహాదేవుని దివ్యానుగ్రహంతో ప్రజలు ఆయురారోగ్యంతో జీవిస్తారని తెలిపారు. పురోహితులు బొప్పన మోహన్, శ్రీనివాసులు, సురేష్, గ్రామ పెద్దలు బొప్పన మోహన మురళీ, బొప్పన చెంగల్రాయులు, లోకా ఫౌండేషన్ నిర్వాహకులు సునీల్ జీ, అరుణ్ జీ పాల్గొన్నారు.

నందిపై భవుని విహారం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి బుధవారం నందివాహనంపై ఊరేగారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో టీఎం వీకండ్రిగ గ్రామానికి చెందిన రెడ్డివారి మంగమ్మ అనే భక్తురాలు నందిసేవకు ఉభయదారులుగా వ్యవహరించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారు నందిపై, అమ్మవారు సింహవాహనంపై ఊరేగారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

నాగలాపురం: ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రస్తుతానికి ఇసుక రీచ్ ఎక్కడా కేటాయించలేదన్నారు. గ్రావెల్ తవ్వకాలకు కూడా అనుమతి లేదన్నారు. పులికుండ్రం, ఎస్ఎస్‌బీపేట పరిధిలో రాత్రిళ్లు ఇసుక రవాణా పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. దీంతో రాత్రి పూట గట్టి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడైనా అక్రమ రవాణా పాల్పడుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్, వీఆర్వోలు సెల్వం, ప్రియాంక, రూపేష్, ఉష పాల్గొన్నారు.

మోపూరుపల్లిలో బెల్టుషాపుపై దాడి

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిధిలోని మోపూరుపల్లిలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ సీఐ బీవీ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో గల ఓ దుకాణంలో అమ్మేందుకు సిద్ధంగా ఉన్న 7 క్వార్టర్ బాటిళ్లు, ఒక బీరు బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుకాణదారుడు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఇసుక లారీ సీజ్

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని అరణియార్ పరివాహక ప్రాంతం నుంచి అడవికొడియంబేడు సమీపంలో అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలించి వేరొక చోట డంపింగ్ చేసి లారీల్లో తమిళనాడుకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో దాడి చేసి లారీని సీజ్ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాత్రిపూట గస్తీ నిర్వహిస్తుండగా అడవికొడియంబేడు సమీపంలో లారీలో ఇసుకను తరలిస్తుండగా తనిఖీ చేశామన్నారు. అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్‌చేసినట్టు పేర్కొన్నారు. తమిళనాడులోని గుమ్మిడిపూండికి చెందిన లారీడ్రైవర్ పాండియన్, శేషంబేడు హరిజనవాడకు చెందిన సంగీత్‌రాజ్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కృషితోనే గుర్తింపు



శ్యామలతను సన్మానిస్తున్న ఫోరం సభ్యులు

నారాయణవనం: ఉపాధ్యాయ వృత్తిలో చేసే పనికి కృషి తోడైతే గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ ఉపాధ్యాయని శ్యామలతను బుధవారం జిల్లా బయాలజీ ఫోరం ఘనంగా సన్మానించింది. శ్యామలత విద్యా, వైజ్ఞానికపరంగా ప్రతిభ కనబరిచి, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయిలో రెండు సార్లు ఉత్తమ హరిత పాఠశాల అవార్డును, అటల్ థింక్ సెంటర్ ఇన్‌చార్జిగా అటల్ మారథాన్, బూట్ క్యాంప్స్‌లో పాఠశాలకు గుర్తింపు తీసుకురావడంతో పాటు చంద్రయాన్–3 సందర్భంగా శాటిలైట్ కోడింగ్‌లో పాఠశాల బాలికలు పాల్గొనడంలో శ్యామలత ఎంతగానో కృషిచేశారు. శ్యామలతను సన్మానించిన వారిలో బయాలజీ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కామాక్షయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు నాగలాపురం ఎంఈవో బాబయ్య, జనార్ధన్ రాజు, కస్తూరయ్య, జయకుమారి. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవ రసాయనాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

శ్రీకాళహస్తి రూరల్: కూరగాయల సాగులో రసాయనాల వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అన్నారు. శ్రీకాళహస్తి మండలం టీఎంఆర్ కండ్రిగలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కూరగాయల సాగులో జీవన ఎరువులు, జీవ రసాయనాల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఏఓ వేణుగోపాలరావు, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నాగమణి, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఉద్యాన అధికారి పుష్పలత, మండల ఏఓ సుధాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, రైతులు పాల్గొన్నారు.